క్లుప్తంగా

హామీలు నెరవేర్చకుంటే ఉత్సవాలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

గంగాధర: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను అడ్డుకుంటామని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం హెచ్చరించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు వారం రోజుల్లో ఎకరాకు రూ. పదివేల నష్టపరిహారం అందిస్తామని సీఎం ప్రకటించిన హామీ నెలలు గడుస్తున్న అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. నష్ట పరిహారం ప్రకటనలకే పరిమితమైందని, ఐదులక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగితే 1.51 లక్షల ఎకరాల్లో మాత్రమే నష్టం వాటిల్లిందని నివేదికలు తయారు చేశారని, రైతులకు లక్ష రుణమాఫీ నాలుగేళ్లు గడిచినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ధరణి పోర్టల్‌తో రైతుల సమస్యలు రెట్టింపయ్యాయని, నష్ట పరిహారం మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు పురమల్ల మనోహర్,దుబ్బాసి బుచ్చయ్య, బూర్గు గంగన్న, బట్టు లక్ష్మీనారాయణ, తోట కరుణాకర్, కరీం, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

గన్నేరువరం మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలి

గన్నేరువరం: మండలంలో మార్కెట్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గన్నేరువరంలో మాట్లాడారు. ఉమ్మడి బెజ్జంకి మండలం నుంచి గన్నేరువరం మండలంగా ఏర్పడిన తర్వాత మార్కెట్ కమిటీ నియామకంలో అన్యాయం జరుగుతోందని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రతిసారి బెజ్జంకి మండలానికే కేటాయిస్తున్నారని, దీంతో గన్నేరువరంకు నిరాశే ఎదురవుతోందన్నారు. అలాగే ఉమ్మడి మార్కెట్ కమిటీ నుంచి మండలానికి ఎన్ని నిధులు కేటాయించారో, ఏం అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దౌర్జన్యాలు సహించం



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

హుజూరాబాద్‌రూరల్: ప్రశాంతంగా ఉన్న హుజూరాబాద్‌లో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారం, రాజకీయ నాయకులు దళితులపై దౌర్జన్యాలకు దిగితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర నాయకుడు మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ పక్షాల ప్రజాసంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. పట్టణ శివారులో దళితులకు సంబంధించిన భూములను జమ్మికుంటకు చెందిన అధికార పార్టీ నాయకుడు హుజూరాబాద్ చెందిన కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, భూములు అక్రమంగా ఆక్రమించుకోడానికి ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. హద్దురాలు పాతిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కొంతమంది అధికారులు తొత్తులుగా మారుతున్నారని, దళితుల భూమి జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దళితులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సొల్లు బాబు,బోరగల సారయ్య, ఫయాజ్ వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అలుగునూర్‌లో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. దాదాపు 30 కుటుంబాలకు చెందిన మహిళలు నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లగా చూడాలని పాడిపంటలు సమృద్ధిగా పండేలా దీవించాలని వేడుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పర్శరాములు, ప్రధాన కార్యదర్శి నరేశ్, సంజీవ్, కుమారస్వామి, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యలకు చెక్

- ఎక్కడికక్కడే ఇంకుడుగుంతల నిర్మాణం
- పెరుగనున్న భూగర్భ జలాలు
- తగ్గనున్న దుర్వాసన, వ్యాధులు, దోమల బెడద

మానకొండూర్: గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థతో పంచాయతీ పాలకవర్గాలకు అనేక ఇబ్బందులు ఉండేవి. మురుగుకాలువలో చెత్త పేరుకుపోవడం, రోడ్డుపై నుంచి మురుగునీరు ప్రవహించడంతో భరించలేని దుర్వాసన, దోమలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలడం, అలాగే చేతి పంపులు, పబ్లిక్ నల్లాల వద్ద, శుద్ధజల ప్లాంట్‌ల వద్ద మురుగునీరు పేరుకుపోవడం, మురుగుకాలువల చివరన ఉన్న భూముల్లోకి మురుగునీరు, గ్రామంలోని చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు వచ్చి చేరడం పంచాయతీ పాలకవర్గాలకు తలనొప్పిగా ఉండేవి. ఇక ఇటువంటి సమస్యలకు చెక్ పడనుంది. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో మురుగునీరు కనిపించకుండా అనేక చోట్ల కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణాలు చేపడుతున్నారు. నీరునిల్వ ఉండే ప్రదేశాలను ముందుగానే గుర్తించడం, నిర్మాణాలు చేపట్టడం చేస్తున్నారు.



లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మించిన ఇంకుడుగుంత

ప్రజా ప్రతినిధుల అనాసక్తి

జిల్లాలో ఈ పనులు అక్కడక్కడా ముమ్మరంగా కొనసాగుతున్నా కొన్ని గ్రామాల్లో సర్పంచులు పనులు చేయించేందుకు ఆసక్తి చూపడం లేదని వినిపిస్తోంది. గతంలో చేసిన పనులకే బిల్లులు సరిగా రాలేదనే భావనతో పనులు పట్ల అంతగా శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. గ్రామాల్లో ఇప్పటికే 80 శాతంకు పైగా ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టారు. పబ్లిక్ నల్లాలు, చేతిపంపులు, కొంతమంది మురుగుకాలువలోకి నీటిని వదులుతున్నారు. మురుగునీరు సంపూర్ణంగా తొలగించేందుకు కాలువల చివరి కమ్యూనిటీ సోక్‌ఫిట్ (ఇంకుడుగుంతలు) నిర్మాణాలు ఉపాధిహామీ కింద చేపట్టింది. మురుగునీటిని ఇంకుడుగుంతల్లోకి మళ్లించి ఇంకిపంజేసి మురుగునీటి సమస్యకు చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

మండలాల వారీగా పూర్తయినవి

మానకొండూర్	25	జమ్మికుంట	39
ఇల్లంతకుంట	08	చిగురుమామిడి	12
రామడుగు	65	గన్నేరువరం	33
గంగాధర	48	చొప్పదండి	30
తిమ్మాపూర్	14	సైదాపూర్	16
శంకరపట్నం	50	కరీంనగర్	24
హుజురాబాద్	13	కొత్తపల్లి	09
వీణవంక	24	మొత్తం	410

నిర్మాణం ఇలా

కమ్యూనిటీ సోక్ పిట్ పొడవు, వెడల్పు 8 ఫీట్లు, లోతు 7 ఫీట్లు. చేతిపంపులు, పబ్లిక్ ట్యాప్‌లు, మురుగుకాలువల చివరన నిర్మిస్తున్నారు. అడుగుభాగంలో బెండడి నింపి పైన గాజులు వేస్తారు. రూ.19 వేలు మెటీరియల్ కోసం రూ.4,080 కూలీలకు చెల్లించనున్నారు.

లక్ష్యం దిశగా ప్రయత్నాలు

జిల్లాలో 1,007 కమ్యూనిటీ సోక్ పిట్‌లు నిర్మించాలనే టార్గెట్ ఉండగా ఇప్పటి వరకూ 410 నిర్మాణాలు చేపట్టారు. పనులు చేపట్టాలని అధికారులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. చాలా గ్రామాల్లో ఉపాధిహామీ కింద పనులు చేపడితే బిల్లులు ఆలస్యంగా వస్తాయనే భావనతో పనులపై ఆసక్తి కనబర్చడం లేదని తెలుస్తోంది. లక్ష్యం దిశగాఅధికారుల ప్రయత్నాలు సాగుతున్నాయి.

సమస్యలు తగ్గుతాయి



సోక్‌పిట్ నిర్మాణాలతో డ్రైయినేజీ, దోమల బెడద ఇతర సమస్యలు తగ్గుతాయి. గ్రామాల్లో ఇప్పుడిప్పుడే పనులు ఊపందుకున్నాయి. చేతిపంపులు, పబ్లిక్ నల్లాలు, మురుగుకాలువల చివరన వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఇంకుడుగుంతల్లోకి మురుగునీరు మళ్లిస్తే ఇంకిపోతుంది. దీనివల్ల సమీప గృహాలకు డ్రైనేజీ బాధలు ఉండవు.

– దివ్యదర్శన్‌రావు, ఎంపీడీవో

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ

హుజూరాబాద్‌రూరల్: జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రవీణ్ పదిహేను రోజుల క్రితం హుజూరాబాద్ మార్కెట్‌లో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమేష్ శుక్రవారం సెల్‌ఫోన్‌ను ప్రవీణ్‌కు అందజేశారు.

కరాటే విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను సన్మానిస్తున్న కొండాల్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన ఎస్కే షాదుల్లా బాబా, మహ్మద్ ఆరీఫ్ బాబా, సాయి, అఖిల్ కట్టాస్, స్పారింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. విద్యార్థులను, కరాటే మాస్టర్ జలీల్‌ను పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, 17వ వార్డు ఇన్‌చార్జి మహ్మద్ ఖాలీద్ హుస్సేన్, మహాత్మా జ్యోతిరావుపూలే కమిటీ చైర్మన్ కొలిపాక సమ్మయ్య, కేసీఆర్ సేవాదళ్ టౌన్ ప్రెసిడెంట్ చందు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మానకొండూర్‌లో బడిబాట ర్యాలీ



చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో...

చిగురుమామిడి: కార్పొరేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా సెక్టోరల్ అధికారి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నముల్కనూర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు ఏటా రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. మనఊరు మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి, ఎంఈఓ కె. శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మునిగంటి శోభారాణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానకొండూర్: బడీడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరల్ అధికారి కె. అశోక్‌రెడ్డి అన్నారు. బడిబాటలో భాగంగా మానకొండూర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం బడీడు పిల్లలు బడిలో ఉండేలా అందరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవం గల ఉపాధ్యాయులు, మౌలిక వనరులు, ఉచిత విద్య, యూనిఫామ్, టెక్స్ట్ బుక్స్, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈఏడాది నుంచి అల్పాహారం, రాగిజావ అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. ఉచిత దుస్తులు, నోటు పుస్తకాలు, పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం, అనుభవంగల ఉపాధ్యాయులతో విద్యాబోధన, ఇతర మౌలిక వసతులు ఉంటాయని ఇంటింటికి తిరుగుతూ చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. ఇరవై మంది విద్యార్థులను కొత్తగా చేర్చుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గన్నేరువరం: గునుకుల కొండాపూర్‌లో...

సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచి

- అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతోంది
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక: సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిలా మారాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్రకు చెందిన 27 మంది సర్పంచులు చల్లూర్ గ్రామంలోని దళితబంధు యూనిట్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కౌశిక్‌రెడ్డి వారితో మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి 20 వేల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున అందజేసి వారి కుటుంబాల అభివృద్ధికి దోహదపడుతున్నారని, తెలంగాణ మోడల్‌గా దేశం మొత్తం అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచులు జ్యోతిరమేష్, ఎంపీటీసీ సవితమల్లయ్య, ఎంపీవో ప్రభాకర్, దళిత బంధు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీ కార్యాలయం ప్రారంభం

ప్రభుత్వం అన్ని గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీలు నిర్మిస్తోందని పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మామిడాలపల్లిలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, మహారాష్ట్ర సర్పంచులు, వీణవంక మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలు సుందరంగా ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్తూ అనేక పథకాలను అమలు చేస్తూ అధిక నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రేణుకతిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మదారపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, సర్పంచులు బండ సుజాతకిషన్‌రెడ్డి, కొత్తిరెడ్డి కాంతారెడ్డి, బండారి ముత్తయ్య, గంగాడి సౌజన్యతిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ సత్యనారయణరెడ్డి, ఎంపీవో ప్రభాకర్, ఆర్ఐ గోనె రవీందర్, వార్డు సభ్యులు తోపాటు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మామిడాలపల్లిలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న కౌశిక్‌రెడ్డి

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందంజ

దశాబ్ది ఉత్సవాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గన్నేరువరంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మానకొండూర్: అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ముంజంపల్లి కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ సంక్షేమ సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గొర్రెల యూనిట్లు, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టామని, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, పింఛన్లు తదితరవి అమలు చేస్తున్నామని తెలిపారు. సబ్బండ కులాల వారిని ఆదుకుంటున్నామని, దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇలు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు ప్రభుత్వం అందజేయనుందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్షాలు ఓర్వడం లేదన్నారు. జెడ్పీ సీఈవో ప్రియాంక కర్ణన్ మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

గన్నేరువరం: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గన్నేరువరంలో నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం లయన్స్ జిల్లా గవర్నర్ రిక్కల నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రామాల్లో స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతూ.. గ్రామాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి, లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, డిస్టిక్ వైస్ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి, నడిపల్లి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ న్యాత స్వప్న, సర్పంచ్ పుల్లెల లక్ష్మి, గంప వెంకన్న, బద్దం తిరుపతిరెడ్డి, బూర శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, రవీందర్, రామకృష్ణ, భూమయ్య, ప్రభాకర్, వెంకటరమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బద్రిశం, రమేశ్, అబ్దుల్ మతిన్, ప్రమోదరెడ్డి, ఎల్లయ్య, అంజిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలి

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాల కోసం గ్రామసభలో చర్చించకుండా లబ్ధిదారులను ఎంపిక చేశారని జీపీ కార్యాలయం ఎదుట పంచాయతీ పాలకవర్గ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్ కర్ర సత్యప్రసన్న మాట్లాడుతూ.. లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలన్నారు. గ్రామంలో ఒక్క గుంటకు కనీసం రూ.15లక్షల విలువ ఉంటుందని, ఖరీదైన భూమి ఇళ్ల స్థలాలకు కేటాయించి గ్రామసభ నిర్వహించకుండా ఎంపిక చేయడం సరికాదన్నారు. గ్రామంలో చేపట్టే ప్రతి పని గ్రామసభ ద్వారా ఎంపిక చేశామని, ఇది కూడా గ్రామసభ ద్వారానే ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఎంతమందికి ఇస్తున్నారు.. ఎక్కడ ఇస్తున్నారు..పేర్లు ఇవ్వడం లేదని వాపోయారు. రహస్యంగా ఎంపిక చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. కలెక్టర్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడగా పాలకవర్గానికి చెప్పాలని ఏమీ లేదని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి.కవిత, వార్డు సభ్యులు ఎస్.కవిత, ఎస్. తిరుపతి, ఎ.హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పాలక వర్గ సభ్యులు

గాలివాన బీభత్సం





మానకొండూర్: మండలంలో శుక్రవారం సాయంత్రం గాలిదుమారం బీభత్సం సృష్టించింది. గాలిదుమారంతో పాటు వర్షం పడటంతో చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు విరిగి రహదారిపై పడగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి, చెట్ల కొమ్మలను రహదారిపై తొలగించి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. విద్యుత్ సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందు కు అనేక తంటాలు పడుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పంపిణీ చేశారు. శుక్రవారం మండలానికి సంబంధించి రూ.5.25 లక్షల విలువ గల చెక్కులను హుస్నాబాద్ మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వినీత, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రమణారెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ రామోజు రజితకృష్ణమాచారి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు సాంబారి కొంరయ్య, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ తిరుపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.